రాబోయే రోజులు బీఆర్‌ఎస్‌వే




మాట్లాడుతున్న పద్మారావు, తలసాని

సికింద్రాబాద్‌లో గెలిచి తీరుతాం
● పద్మారావు గౌడ్

రాంగోపాల్‌పేట్: రాబోయే రోజులు బీఆర్‌ఎస్ పార్టీవేనని, మళ్లీ కేసీఆర్ సీఎం కావడం తథ్యమని, సికింద్రాబాద్ లోక్‌సభ సీటును గెలిచి తీరుతామని ఆ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐ టీ ఆడిటోరియంలో మాజీ మంత్రి తలసాని శ్రీని వాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో పద్మారావు పాల్గొని ప్రసంగించారు. సామాన్య కార్యకర్త నుంచి తాను ఈ స్థాయికి వచ్చానని తలసాని తాను మంచి మిత్రులమన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల పరిధిలో 6 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని అందరం మంచి మెజార్టీతో గెలిచామని అదే ఊపుతో పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంటు నుంచి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా నిధులు తేలేదని, కేవలం జై శ్రీరాం, మోదీ అంటూ ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియదని, ఎమ్మెల్యేగా రాజీనామా చేయకుండానే ఎంపీగా పోటీ చేస్తున్నాడని, రాబోయే రోజుల్లో ఉన్న పదవి ఊడిపోతుందని అన్నారు. శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక అన్నీ డ్రామాలాడుతున్నారని ప్రజలు ఈ డ్రామాలన్నీ చూస్తున్నారని విమర్శించారు. శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్లమెంటు ఎన్నికలు వచ్చాయని మరో 6 నెలలు ఆలస్యంగా వచ్చి ఉంటే ఫుట్‌బాల్ ఆడేవాళ్లమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, పార్లమెంటరీ ఇన్‌చార్జ్ రాజీవ్ సాగర్, కార్పొరేటర్లు కొలను లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, శేషుకుమారి పాల్గొన్నారు.

పోటెత్తి ఓటేద్దాం!



● లష్కర్‌లో ఓటు హక్కు వినియోగంపై ప్రచారం
● ఇంటింటి సర్వేలు, చైతన్య సదస్సులు ● భారీ పోలింగ్‌కు అధికారుల కసరత్తు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన ప్రతిసారి పోలింగ్ శాతం 50–55 శాతంకు మించి ఓటింగ్ జరగడం లేదు. బస్తీల ప్రజలు పోలింగ్‌లో పాల్గొనేందుకు బారులు తీరుతుండగా కాలనీల ప్రజలు మందకొడిగా పాల్గొంటున్నారు. నియోజకవర్గంలో ఓ మోస్తరుగా ఉన్న రైల్వే కాలనీలు, రైల్వే క్వార్టర్స్ ఓటర్లు మొత్తంగా పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ మారు జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ అయిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బూత్‌లెవల్ ఆఫీసర్లతో ఇంటింటి సర్వేలు చేయిస్తున్నారు. ఆయా ప్రాంతాల ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండేందుకు గల కారణాలు విశ్లేషిస్తున్నారు. సదరు ఓటర్లు ఆయా చిరునామాల్లో ఉంటున్నారా లేరా అన్న అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు సహకరించాలని ఎన్నికల అధికారులు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా రైల్వే కాలనీల్లో బూత్‌లెవల్ ఆఫీసర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అత్యల్పం తీరు ఇది..

శాసనసభ, పార్లమెంట్, జీహెచ్‌ఎంసీ ఇలా గత ఆరు ఎన్నికలను పరిశీలిస్తే సికింద్రాబాద్ నియోజకవర్గంలో 55 శాతానికి మించి ఎప్పుడూ పోలింగ్ జరగలేదు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో కొంతమేర సంతృప్తికర పోలింగ్ జరుగుతోంది. అత్యధిక బస్తీలు కలిగిన అడ్డగుట్ట డివిజన్లలో సైతం పోలింగ్ మందకొడిగానే సాగింది. ఇక సంపన్నులు నివసించే తార్నాక డివిజన్, రైల్వే కుటుంబాలు ఎక్కువగా ఉండే మెట్టుగూడ డివిజన్లలో పోలింగ్ శాతం నిరాశాజనకంగా ఉంటుంది. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ మొత్తం మీద 220 పోలింగ్ బూత్‌లు ఉండగా అందులో కేవలం 35 బూత్‌లలో మాత్రమే 50 శాతం పోలింగ్ జరుగుతోంది.

మార్పు కోసం కసరత్తులు..

నియోజకవర్గంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను జోడిస్తూ ఓటర్లకు వినూత్న అవగాహన కలిగిస్తున్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పట్ల నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాజాగా ఏర్పాటు చేస్తున్న సదుపాయాలు, ఎక్కువ సమయం క్యూ లైన్లలో నిలబడే పరిస్థితులు దూరమైన పరిస్థితులను ఓటర్లకు వివరిస్తున్నారు. ఓటు హక్కుతో సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడే అభ్యర్థిని బలపర్చాలని చైతన్య సదస్సుల ద్వారా వివరిస్తున్నారు.

గత 6 ఎన్నికల్లో సరాసరి పోలింగ్

- 34 పోలింగ్ బూత్‌లలో 50–53 శాతం
- పేద, మధ్యతరగతి ప్రజల 126 బూత్‌లలో 50 శాతం
- సంపన్నుల కాలనీల్లోని బూత్‌లలో 38 శాతం
- బౌద్ధనగర్‌లోని రెండు బూత్‌లలో 70 శాతం
- అత్యల్ప పోలింగ్ జరిగిన రైల్వే బూత్‌లలో 29 శాతం

పోలింగ్ శాతం పెంపునకు సహకరించాలి..

ఓటర్లందరు స్వేచ్ఛగా తమ హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా అవసరమైన వసతులు ఏర్పాటు చేశాం. క్యూ లైన్లతో సమయం వృథా కాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విద్యావంతులు ఎక్కువ సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. రాజకీయ పార్టీల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు సహకరించాలి.

–సుభాష్‌రావు, సహాయక ఎన్నికల అధికారి

నేటి నుంచి బాంబే సర్కస్ ప్రారంభం



వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నేటి (26) నుంచి బాంబే సర్కస్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు ఇంతియాజ్ ఖాన్, ఉన్ని కృష్ణన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వందేళ్ల క్రితం కళాకారులను ప్రోత్సహించేలా బాబురావ్ కదమ్ ఆధ్వర్యంలో బాంబే సర్కస్ ప్రారంభమైందన్నారు. ఈ సారి ఏర్పాటు చేసే సర్కస్‌లో సముద్ర సింహాలు, గొరిల్లాలు, బ్లాక్ పాంథర్, హిప్పోపోటామస్, గుర్రాలు, ఏనుగులతో పాటు రష్యన్, నేపాల్, బాంబే కళాకారుల ప్రదర్శన ఉంటుందన్నారు. రోజు మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం నాలుగు, రాత్రి ఏడు గంటలకు ప్రదర్శనలు ఉంటాయన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారంలో పాల్గొన్న నివేదిత

రసూల్‌పురా: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్న పేర్కొన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఆమె రసూల్‌పురా, గన్‌బజార్, ఇందిరమ్మనగర్, ఇతర బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రసూల్‌పురా వార్డు పరిధిలోని పలు బస్తీల్లో పవర్‌బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, కమ్యూనిటి హాల్స్‌తో పాటు సిల్వర్ కాంపౌండ్, నారాయణ జోపిడి సంఘం బస్తీల్లో బీఆర్‌ఎస్ పాలనలో తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆధ్వర్యంలో డబుల్‌బెడ్రూమ్ తదితర అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. కంటోన్మెంట్‌లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుపై ఓటేసి తనతో పాటు మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. రఘురామన్, శ్యామ్, కుమార్, శ్రీనివాస్, వాహెబ్, అజ్జు, సమీర్, ఫస్సీ, అంజనేయులు, జిలానీ, నర్సింహ, మల్లేష్ మహేష్ చబ్రేజ్, సురేష్, బాబు, ప్రవీణ్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ లోక్‌సభకు 57 నామినేషన్లు

చివరి రోజు 23 దాఖలు



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బొగ్గుల సునీత

సికింద్రాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నిక కోసం చివరి రోజైన గురువారం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 10 మంది స్వతంత్ర అభ్యర్థులుగా, మిగతా 13 మంది వివిధ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. వివిధ పార్టీల నుంచి కొలిశెట్టి శివకుమార్ (యుగతులసి), మహ్మద్ రఫీయుద్దీన్ కలీం (మజీద్ ఈ ఇంక్విలాబ్ ఈ మిలాత్), మారోజు వెంకటేశ్వరాచారి (తెలంగాణ జీవన రైతు), చీకటి భూపతిగౌడ్ (బ్యాక్‌వర్డ్ పీపుల్ సునామీ), రాసల వినోద్‌కుమార్ (ధర్మసమాజ్), ఆంధ్రపు సుదర్శన్ (శివసేన), దాసరి రత్నయ్య (జనరాజ్యం), గౌట గణేశ్ (శివసేన–యూబీటి), ఆడం అహ్మద్‌షేక్ (విద్యార్థుల రాజకీయ), దండెపు బస్వానందం (బీఎస్పీ), మహ్మద్ అయూబ్ అలీ (అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్), స్వతంత్ర అభ్యర్థులుగా బొగ్గుల సునిత, జే.ఆసం సిద్దిఖీ, ఇబ్రహీం ఖాన్, సపావత్ సుమన్, మహ్మమద్ ఇబ్రహీం అహ్మద్, పి.నాగనలినీకాంత్ నామినేషన్లు దాఖలు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల సంఖ్య 57కు చేరినట్టు రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ ప్రకటించారు.

కిషన్‌రెడ్డి గెలుపునకు పనిచేస్తాం



మాట్లాడుతున్న ముదిరాజ్ నాయకులు

అమీర్‌పేట: సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు కోసం పనిచేస్తామని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని కిషన్ రెడ్డిని గెలిపిస్తే మరింతా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

కిషన్‌రెడ్డిని గెలిపిస్తాం

బౌద్ధనగర్: ముదిరాజ్‌లందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. సికింద్రాబాద్‌లోని ముదిరాజ్ సంఘం నాయకులు కిషన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గురువారం బౌద్ధనగర్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయనతో పాటు ఓబీసీ రాష్ట్ర నాయకులు సదానంద్ ముదిరాజ్ హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ బీసీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కేంద్రం ప్రభుత్వంలో 27 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించారని, స్వయంగా ప్రధాని ఒక ఓబీసీ అని అందుకే ముదిరాజులందరూ సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో సతీష్ రాజ్, కనకట్ల హరి, నీలం శ్రీనివాస్, రమేష్, నాగేష్, బిజేపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్, రాజభూపాల్, యుధ్వీర్, హనుమంతు, సందీప్, గణేష్, ఓములు పాల్గొన్నారు.

ఘనంగా ఓయూ ఫౌండేషన్ డే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్లు

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ ప్రొ. జాస్తీ రవికుమార్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓయూ విశ్రాంత ప్రొ. విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ కోసం విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. ప్రొ.అప్పారావు పరివర్తన చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, విద్యార్థులు ఈ అంశాలను ఏ విధంగా స్వీకరించాలనే అంశంపై ప్రసంగించగా, ప్రిన్సిపల్ రవికుమార్ యూనివర్సిటి చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మృదుల వివిధ విభాగాధిపతులు డా. పద్మ, డా. లక్ష్మి, డా. సంధ్యారాణి, డా. సత్యసాయి లక్ష్మి, డా. శ్రీదేవి. రవి. పి. మురళి, టి. శ్రీధర్, వెంకటేశం పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు. యాష్కి అనసూయ చిత్రపటం వద్ద జాక్ నేతలు శ్రద్ధాంజలి ఘటించి మధుయాష్కి గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీ–జాక్ చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తమ్, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్, రవి పాల్గొన్నారు.

సీఎం రోడ్‌షోకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్‌కు మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం రాత్రి బాలంరాయి కమాన్ నుంచి అన్నానగర్ చౌరస్తా వరకు నిర్వహించిన రోడ్‌షోకు నియోజకవర్గానికి నుంచి భారీగా తరలి వెళ్లారు. ఎన్నికల ఇన్‌చార్జి పల్లే లక్ష్మణ్‌గౌడ్, పీసీసీ సెక్రటరీ అయూబ్ ఖాన్, ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి, నాయకులు జమీల్, నాగిరెడ్డి, రాజేష్ యాదవ్ పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లారు. అదే విధంగా ఈద్గా అంబేడ్కర్ నగర్ నుంచి దాల్‌రాజు, రాములు ఆధ్వర్యంలో వందలాది మంది తరలివెళ్లారు.

జాతీయ అవార్డు ప్రదానం



లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిల పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ భాగ్యలక్ష్మీ ఇటీవల స్వామి వివేకానంద జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ నెల 21న ఉత్తరప్రదేశ్ లక్నోలో ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ కాంక్లేవ్‌లో ఈ అవార్డు అందుకున్నారు.

తల్లీబిడ్డల అదృశ్యం



బౌద్ధనగర్: తల్లి ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన ఎం. రాజలక్ష్మి(32)కి ఈ నెల 13న తన భర్తతో చిన్న గొడవ జరిగింది. ఈ క్రమంలో మరుసటి రోజు భర్త ఇంట్లో లేని సమయంలో తన కూతురు లక్ష్మి నక్షత్ర(06), కుమారుడు సూర్య సిద్ధార్థ్(05)ను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన భర్త నర్సింహ బంధువులు, తెలిసిన వారితో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డగుట్ట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ థామ్సన్ వివరాల ప్రకారం.. లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని ఖాళీ స్థలంలో 35–40 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

10కిలోల గంజాయి స్వాధీనం



గంజాయిని చూపిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో రైల్వే పోలీసులు 10 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయిశ్వర్‌గౌడ్ నేతృత్వంలో గురు వారం రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. లగేజీలను తనిఖీలు చేస్తుండగా ఓ ప్రయాణికుడి బ్యాగు నుంచి గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నడుస్తున్న కారులో చెలరేగిన మంటలు



సనత్‌నగర్: నడుస్తున్న కారు ఇంజిన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కారు యజమాని బయటకు రావడంతో రెండు ప్రాణాలు దక్కాయి. ముషీరాబాద్‌కు చెందిన రాజేందర్ వ్యక్తిగత పనులపై గురువారం టాటా ఇండికా కారులో తన భార్యతో కలిసి బేగంపేట వైపు వెళ్తున్నాడు. బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డు బ్రిడ్జిపై కట్టమైసమ్మ ఆలయం వెనుకకు రాగానే కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన రాజేందర్, ఆయన భార్య కిందికి దిగడంతో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.

రోడ్‌షోకు స్పందన




కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్‌కు మద్దతుగా గురువారం బాలంరాయి కమాన్ నుంచి అన్నానగర్ వరకు నిర్వహించిన రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కంటోన్మెంట్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. –రసూల్‌పురా

చందన అలంకరణలో బాలాంజనేయ స్వామి



చిలకలగూడ : చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ 71వ జయంతి వార్షిక వేడుకలలో భాగంగా మూడవ రోజైన గురువారం స్వామివారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో మేళతాళాలు, బాజా భజంత్రీలు, వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ సుప్రభాత సేవ, సింధూర అలంకరణ, నిజాభిషేకం, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ధన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అవినాష్ కాలేజీ సత్తా



సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ ఫలితాల్లో అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ఎల్‌బీనగర్ బ్రాంచికి చెందిన గోలి రశ్మిత 496 మార్కులతో సత్తా చాటింది. అంతేకాక మరో 9 మంది స్టేట్ సెకండ్ మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ బ్రాంచి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ డా.అవినాష్ బ్రహ్మదేవర టాప్ ర్యాంకర్లను అభినందించి మాట్లాడారు. అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులు 75 మందికి పైగా టాప్ 5 ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. డైరెక్టర్లు సంతోష్ బుద్ధ, కే.వట్టాభిరామ్, డీన్ అకాడెమిక్స్ సుశీల కందూరి, ఎల్‌బీనగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ నీరజ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులు సత్తా చాటారు



ఉస్మానియా యూనివర్సిటీ: ఇంటర్ ఫలితాల్లో విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ ఎం.శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ద్వితీయ సంవత్సరంలో కిరణ్ సీఈసీ (944/1000) వి.భరత్‌శర్మ సీఈసీ(919/1000) అంధ విద్యార్థి మురళి హెచ్‌ఈసీ (820/1000)సాధించారు. మొదటి సంవత్సరంలో స్వాతి (427/500) శిధర్ (403/500) సాధించారన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన వారిని అభినందించి సన్మానించారు. అధ్యాపకులు దేవన్న, ఉమారాణి, విజయలక్ష్మి, హేమలత, రఫత్ జాహన్, గీతారాణి పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ఫ్లెక్సీల తొలగింపు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థికి ఎన్నికల విభాగం అధికారులు షాక్ ఇచ్చారు. గురువారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి రోడ్‌షో, కార్నర్ మీటింగ్ సందర్భంగా శ్రీగణేష్, ఇతర కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బాలంరాయి కమాన్ నుంచి జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఎన్నికల విభాగం అధికారుల ఆదేశాలతో బోర్డు సిబ్బంది తొలగించారు. ఫ్లెక్సీలు తొలగిస్తున్నట్లు సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీ మైనంపల్లి హన్మంతరావు అన్నానగర్ చౌరస్తా వద్దకు చేరుకుని తొలగించవద్దని సూచించినప్పటికి అధికారుల ఆదేశాలతో తొలగిస్తున్నట్లు సిబ్బంది చెప్పారు. ఫ్లెక్సీలను మాత్రమే తొలగిస్తున్నామని పార్టీ జెండాలను అలాగే ఉంచుతున్నామని చెప్పడంతో మైనంపల్లితో సహా కాంగ్రెస్ నేతలు వెనుతిరిగి వెళ్లిపోయారు.

ఓపెన్ డేకు విశేష స్పందన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 107 ఫౌండేషన్ డేలో భాగంగా రెండో రోజున ఉస్మానియా తక్ష్ (చెక్కడం) సందర్భంగా నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గురువారం ల్యాబ్ టు ల్యాండ్ పేరుతో ప్రయోగశాలలో జరిగే పరిశోధనలు సమాజానికి తెలియచెప్పేందుకు వర్సిటీ క్యాంపస్‌లోని కాలేజీలు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, వర్క్‌షాపులను విద్యార్థుల సందర్శనార్థం తెరిచి పెట్టారు. నగరంలోని కాలేజీలు, పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో వర్సిటీని సందర్శించారు. ఓపెన్ డే కార్యక్రమాన్ని వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

133 కిలోల కేక్‌తో అంబేడ్కర్ జయంతి



కేక్‌కట్ చేస్తున్న చినేని వెంకట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 133 కిలోల కేక్‌తో డా. అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మాల విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ మాల ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చినేని వెంకట్, బిషఫ్ అద్దంకి ఒఫిర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేసి మాట్లాడారు. మాల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా చేస్తున్న అంబేడ్కర్ జయంతికి ఓ ప్రత్యేకత ఉంది. అంబేడ్కర్ 128వ జయంతి సందర్భంగా 2018లో 128 కేజీల కేక్‌కట్ చేసిన విద్యార్థి నేతలు ప్రతి ఏటా పెంచుతున్నారు. ఈ ఏడాది 133వ జయంతి సందర్భంగా 133 కిలోల కేక్‌ను కట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్, వెంకటరాములు, కిరణ్, ప్రశాంత్, తరార్, దత్తాత్రేయ, కృష్ణంరాజు పాల్గొన్నారు.